క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన కావుడే మధునయ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకుడు కోనేరు నాగేశ్వర్ రావు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

బీజేపీ నాయకుల పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మధునయ్య కుటుంబాన్ని బీజేపీ నాయకులు సోమవారం పరామర్శించారు. ప్రమాదంలో గాయాలపాలైన ఆయన భార్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

ఆకట్టుకున్న దండారీ



నృత్యం చేస్తున్న గుస్సాడీలు

కెరమెరి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన గుస్సాడీ నృత్యాలు కనుల విందు చేశాయి. దేవాపూర్ గ్రామపంచాయతీలోని ఖట్టిగూడ గ్రామంలో మహిళా దండారీ వేడుకలు వైభవంగా జరిగాయి. సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్న సాకడ గ్రామానికి చెందిన గుస్సాడీ, మహిళ దండారీ బృందానికి ఖట్టిగూడ ఆతిథ్యమిచ్చారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావు, నాయకులు దంబీరావు, తుకారం, రాము, దేశ్‌శావ్, జంగు, సుంగు, లింగు, ఇస్రు, నగేశ్, బడిరాం, జలపతిరావు, శ్రీనివాస్, సోము, భీంరావు తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

'ఆర్ఎస్పీపై దాడులకు దిగడం సరికాదు'

బెజ్జూర్: ఆర్ఎస్పీపై దాడులకు దిగడం దుర్మార్గమైన చర్య అని బహుజన ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ రజీ హైదర్ అన్నారు. కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన బహుజన ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బీఎస్పీ లీగల్ అడ్వైజర్ కిషోర్ కుమార్, నాయకులు ఆత్రం సాయి, విజయ, నిర్మల, అమృత, ఖాజా సమీఉద్దీన్, ఖాజామోయినొద్దీన్, అశోక్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధన పూజ

బోథ్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో సోమవారం గోవర్ధన పూజ నిర్వహించారు. గోమాతకు గ్రామస్తులు హారతులు ఇస్తూ.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుస్సాడీ నృత్యం చేశారు. అమృత్‌రావు, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ధనలక్ష్మి పూజలు చేస్తున్న భక్తులు



బెజ్జూర్: విద్యుత్ కాంతుల్లో చిన్న సిద్దాపూర్‌లోని హనుమాన్ ఆలయం



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో చిన్నారి సందడి

ఇంటింటా దీపాల వెలుగులు

జిల్లాలో దీపావళి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో పూల తోరణాలు, దీపాలతో ఇళ్లను అలంకరించారు. పండుగ సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మహిళలు ప్రత్యేక పూజలతో పాటు నోములు నిర్వహించారు. బంతి పూలు, విద్యుద్దీపాలతో వ్యాపార వాణిజ్య సముదాయాలను శోభాయమానంగా అలంకరించారు. దుకాణాలు, ఇళ్లలో ధనలక్ష్మి, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు భారీగా టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రెబ్బెన: గోలేటిలో టపాసులు కాల్చుతున్న యువతి



కౌటాల: వీర్దండిలో..



కెరమెరి: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కౌటాల: శివాలయంలో..



రెబ్బెన: దీపాలతో ఎంపీపీ సౌందర్య



కెరమెరి: లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



దహెగాం: కేజీబీవీలో దీపాలు వెలిగిస్తున్న విద్యార్థినులు



కెరమెరి: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కార్తీక మాసం షురూ..!

- దీపోత్సవాలకు ఆలయాలు సిద్ధం
- నెల రోజులపాటు ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్/కెరమెరి: కార్తీక మాసం అంటే ఆధ్యాత్మికం వెల్లివిరిసే నెల. దీపావళి మరునాడు వచ్చే కార్తీక మాసం ఈఏడాది రెండోరోజు నుంచి ప్రారంభమవుతుంది. కార్తీక మాసంలో సోమవారాలకు ఎంతో విశిష్టత ఉంది. పరమేశ్వరుడు, విష్ణుమూర్తులకు ప్రీతిపాత్రమైన మాసంగా కార్తీక మాసాన్ని పరిగణిస్తుంటారు. ఈమాసంలో శివకేశవులను పూజిస్తే పుణ్యఫలాలతో పాటు ముక్తి ప్రాప్తిస్తుందని నమ్ముతారు. శివుడిని అంతఃకరణ శుద్ధితో ప్రార్థించి లింగాభిషేకం చేస్తే భక్తుల అభిష్టాలు నెరవేరుతాయని పురోహితులు చెబుతుంటారు. మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో జిల్లాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి.

ప్రతీరోజు పర్వదినమే..

కార్తీక మాసంలో ప్రతీరోజు పర్వదినమే. ఈ పుణ్యమాసంలో కార్తీక సోమవారాలు అత్యంత పవిత్రమైనవిగా శివపురణం తెలియజేస్తోంది. సోమవారం శివరాధన చేయడం, ఈశ్వరుడిని పంచామృతంతో అభిషేకించడం, ఉపవాసం ఆచరించడం, నదీ స్నానం చేసి దీపారాధన చేయడంతో హరిహరుల అనుగ్రహం కలుగుతుందని కార్తీక పురాణం చెబుతుంది. భగినీ హస్తభోజనం, నాగ పంచమి, ఉత్పాద ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, జ్వాలా తోరణం దర్శనం చేసుకోవడంతో సర్వపాపాలు ప్రక్షాళనమవుతాయి. కార్తీక పౌర్ణమి నాడు భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తుంటారు.

నదీ స్నానాలు..

కార్తీక మాసంలో నదీ స్నానం, దీపం వెలిగించడం, ఉపవాసాలు, వనభోజనాలు ముఖ్యమైనవి. సూర్యుడు ఉదయించకముందే కార్తీక స్నానం చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దూరమై మానసిక ఆహ్లాదం కలుగుతుంది. కార్తీక మాసంలో వెలిగించే దీపానికి చాలా ప్రాముఖ్యత ఉంది. కార్తీక మాసంలో నువ్వుల నూనె నెయ్యితో పెట్టిన దీపం నుంచి వచ్చిన పొగ పీల్చటం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. ఉదయం, సాయంత్రం గృహం, పూజా మందిరం, తులసి సన్నిధి, ఆలయంలో దీపారాధన చేయడంతో సకల సౌఖ్యాలు కలుగుతాయి.

ఆలయాల్లో పూజలు..

దీపావళి మరుసటిరోజు సోమవారం కావడంతో మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు. ద్విచక్రవాహనాలకు పూజలు నిర్వహించారు.



ఆలయంలో ధ్యానం చేస్తున్న భక్తులు

ప్రతీరోజు మహిమాన్వితం..



కార్తీక మాసంలో ప్రతీరోజు మహిమాన్వితమైనది. హరిహరులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం ఇది. శివునికి పూజలు చేయడం వల్ల సర్వపాపాలు హరిస్తాయి. విశ్వనాథస్వామి ఆలయంలో ప్రతీరోజు వేంకటేశ్వరస్వామికి అర్చనలు, రుద్రాభిషేకం నిర్వహిస్తాం.

– భట్టాచార్యులు, అర్చకుడు, మంచిర్యాల

ఉపవాసం దివ్యౌషధం..



మహిళలు ఎంత ఎదిగినా సంప్రదాయాలు మరువకూడదు. మన సంప్రదాయాన్ని పిల్లలు తెలుసుకునేందుకు కార్తీక మాసం వేదికగా మారుతుంది. పౌర్ణమి నాడు ఉపవాసం ఉంటే నెలంతా ఉన్న ఫలితం లభిస్తుందని నమ్మకం. దంపతులు ఉపవాసం ఉంటే ఇంకా మంచిది.

– ఆదే రుక్మాబాయి, గోపాల్‌వాడ, కెరమెరి



తిర్యాణిలో పత్తితీతకు సిద్ధంగా ఉన్న చేను

వేధిస్తున్న కూలీల కొరత

- పెరిగిన పెట్టుబడి, తగ్గిన దిగుబడి
- మహారాష్ట్ర నుంచి వస్తున్న కూలీలు
- ఆందోళనలో పత్తి రైతులు

తిర్యాణి: ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. పత్తితీతకు కూలీలు దొరక్క అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురువడంతో పత్తి పంట ఏపుగా పెరిగింది. దీంతో పంట దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ పత్తి పంట కాయకొచ్చే దశ నుంచి వర్షాలు లేకపోవడంతో చెట్టుకు 15 నుంచి 30 కాయలు మాత్రమే కాశాయి. ప్రస్తుతం కూడా వర్షాలు లేక చెట్లకు సరిపడా నీటి పదన లేకపోవడంతో పూర్తిగా ఎండిపోతున్నాయి. ఈ ఏడాది ఎకరాకు ఐదు క్వింటాళ్ల పత్తి కూడా రావడం కష్టంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేనులో ఉన్న పత్తితీతకు కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

మండలంలో 21,526 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెట్టుబడి గణనీయంగా పెరిగింది. వాతావరణ ప్రతికూలతతో ఎరువులను అధికంగా వినియోగించారు. పురుగు మందులు అధికంగా పిచికారీ చేశారు. పత్తి ఏరివేతకు ప్రారంభంలోనే కిలోకు రూ.10 వరకు తీసుకుంటున్నారు. అడిగిన మొత్తం ఇచ్చేందుకు అన్నదాతలు సిద్ధంగా ఉన్నా సకాలంలో కూలీలు దొరకడం లేదు. దీంతో కొందరు రైతులు సరిహద్దులోని మహారాష్ట్ర గ్రామాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. దీంతో ఎకరం పత్తి సాగుకు రూ.25 వేల పెట్టుబడి మించి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తికి బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.7000 ధర దాటకపోవడంతో ఈసారి పెట్టిన పెట్టుబడి కూడా రావడం కష్టమేనని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పత్తికి కనీస మద్దతు ధర రూ.15 వేలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడి రావడం కూడా కష్టమే



ఈ ఏడాది ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశా. పంట కాయకొచ్చే దశ నుంచి వర్షాలు పడడం లేదు. దీంతో చాలా తక్కువ కాయలు కాశాయి. ఉన్న పత్తిని తీయడానికి కూలీలు దొరకడం లేదు. ఎకరాకు ఐదు క్వింటాళ్ల పత్తి కూడా రావడం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా రావడం కష్టమే.

– గట్టయ్య, యువ రైతు, నాయకపుగూడ

మహారాష్ట్ర నుంచి కూలీలు..



పత్తి పంట ఏరడానికి కూలీలు దొరకడం లేదు. తెలిసిన వాళ్ల ద్వారా మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొచ్చా. మొదటి విడుత పత్తితీతకే కిలోకు రూ.10 తీసుకుంటున్నారు. పండిన పంటకు మద్దతుధర ప్రభుత్వం కల్పించాలి. లేకపోతే చాలా నష్టపోతాం.

– దుర్మెట్టి సతీశ్, తిర్యాణి

చూడముచ్చటగా మండపాలు



గుస్సాడీలు దండారీ ఆడే మండపం

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో వారం రోజుల నుంచి కొనసాగుతున్న దండారీలు గిరి పల్లెలను హోరెత్తిస్తున్నాయి. దండారీ బృందం సభ్యులు నృత్యాలు చేసేందుకు ఏర్పాటు చేసిన మండపాలను చూడముచ్చటగా తయారు చేశారు. కొన్ని మండపాలు చీరలతో తయారు చేయడం విశేషం. చిన్నచౌపన్‌గూడ, ఖట్టిగూడలలో తయారు చేసిన మండపాల ముఖద్వారాలు కనులవిందు చేస్తున్నాయి.



ఖట్టిగూడలో చీరలతో తయారు చేసిన మండపం



ఆకట్టుకుంటున్న దండారీ ముఖద్వారం

జోరుగా బీజేపీ ఇంటింటి ప్రచారం

దహెగాం: మండలంలోని దేవులగూడెం, హత్తిని గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని తిమ్మాపూర్, తంగళపల్లి గ్రామాల్లో సిర్పూర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే పట్టించుకోక పోవడం వల్ల అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. మండల అధ్యక్షుడు ధనుంజయ్, సత్యనారాయణ, సురేశ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, సిర్పూర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు సతీమణి శివాని సోమవారం పట్టణంలోని గొల్లవాడ, మేథర్ కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. సుభాష్‌కాలనీలో పాల్వాయి హరీశ్‌బాబు ప్రచారంలో పాల్గొన్నారు. కాలనీ మాజీ కౌన్సిలర్ గుండు పద్మ తిరుపతి బీజేపీలో చేరారు.

కౌటాల: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సిర్పూర్ అభివృద్ధి సాధ్యమని పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని పార్డి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జాడి సవితతో పాటు గ్రామంలోని పలువురు బీజేపీలో చేరారు.



దహెగాం: మాట్లాడుతున్న హరీశ్‌బాబు

'మాట తప్పిన కేసీఆర్'

దహెగాం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దళితుడిని సీఎం చేస్తానని సీఎం కేసీఆర్ మాట తప్పారని కేంద్ర మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పించారన్నారు. ఇతర పార్టీల ఉచిత హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

కాళీమాతకు ప్రత్యేక పూజలు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని కాళీనగర్‌లో కాళీమాత పూజలు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 24గంటల ఉపవాస దీక్ష చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు బోడ ధర్మేందర్, రీనారాణి దాస్, సూరజ్ మాలో, కాశీనాథ్ చటర్జీ, హర్దస్‌కర్, ధనుంజయ సర్కార్, సంతోష్ మాలో తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: కాళోజీ నారాయణ రావు వర్ధంతి సందర్భంగా లంబాడాల ఐక్యవేదిక (లైవ్) ఆధ్వర్యంలో రోగులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వసంత్‌రావు, జిల్లా కన్వీనర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.